
వి.వి.బి. రామారావు

# ఘటన



"అబ్బాయ్! కరివేపాకు కాస్త తీసుకురా..." ముందు గదిలోకి కేకవేసింది.

దేవుడి పీఠం దగ్గర కూచున్న విశ్వనాథంగారికి కామాక్షమ్మ మాటలు వినబడడంలేదు.

గాయత్రీ మంత్రం జపిస్తూ వేళ్ళ ముడువులు లెక్కించుకుంటున్నారు.

"అబ్బాయ్! లేచావా...కరివేపాకు..." ముందుగదిలోకి తొంగిచూసింది.

రమేష్ పెరట్లోంచి కేకపెట్టాడు -"నే నిక్కడ ఉన్నా!" అంటూ.

రమేష్ టేబిల్‌మీద సగం వ్రాసిన ఉత్త

రం కామక్షమ్మ కంట పడింది.

మడితోనే లోపలికి వచ్చి కళ్ళజోడు ఓ సారి తుడుచుకుని చూసింది. కొంతవరకూ చదివింది. ముగింపువరకు రాలేదు ఉత్తరం. వీడికి తండ్రి పోలికే వచ్చింది. అప్పుడే మనసులో ఓ పిల్ల ఉన్నదన్న మాట! ఎవ రీ రమాదేవి?...గ్యాస్ పొయ్యి మీద మూకుడు ఉంది. నూనె కాస్తూ అలోచిస్తోంది.

"ఇదిగో కరివేపాకు." రమేష్ దూరంగా నుంచుని ఆకు కింద పెట్టాడు.

"రమేష్! సాంబారు చెయ్యడానికి తీరిక లేదు. కాస్త పెరుగు పోపు పెడతా!"

"సరే లేమ్మా! సాంబారు లేకపోతే ఏం?" రమేష్ తన గదిలోనికి వెళ్ళిపోయాడు.

విశ్వనాథంగారు తదేకంగా ఆంజనేయస్వామి మూర్తి వంక చూస్తున్నారు. ఆయన దయే తనను కాపాడుతోంది. ఆ భగవంతుడి కరుణ, కటాక్షం తన ఎడల పుష్కలంగా ఉన్నాయి. లేకపోతే తానేమిటి...ఈ స్థానంలో? భగవంతుని దయ తనను నిత్యం ప్రతిక్షణం వెన్నెల వెల్లువలో ముంచుతోంది.

కామక్షి ఎంత మంచిది! అయినా, సహనం స్త్రీ జాతికి ఆభరణం. ఆభరణమే కాదు; అత్యంత శక్తివంతమైన కవచం. ఇంకా పోతే అదే వాళ్ళ చేతిలోని వజ్రాయుధం.

కళ్ళు తెరిచే అందులోకి వెళ్ళాడు తను.

కామక్షికి అన్నీ తెలిసినా, ఏమీ తెలియనట్టే ఉంది. మరో సామాన్యమైన స్త్రీ అయితే ఏడుపులూ, పెడబొబ్బలూ పెట్టేది; కాంతాన్ని ఆడిపోసుకునేది.

కాని, కామక్షి నిండుకుండ. ఎప్పుడూ తొణకలేదు. తనకేమో భయం పట్టుకుంది! చెయ్యకూడని పని చేసి తరువాత ఫలితం అనుభవించవలసి వస్తుంది. అది తప్పదు.

వివాహితుడై, పెళ్ళికాని పిల్లతో...ఛి...ఛీ! ఎంత తొందరపాటుగా ప్రవర్తించాడు తను. దేవుడే సమస్యను తీర్చాలి.

ప్రభూ! నా జీవితం నీ చేతిలో ఉంది. తెలిసి చేసిన తప్పు...శిక్ష ఏదైనా సరే!

అంతే!

కాంతానికి పెళ్ళి కుదిరిపోయి మూడు రోజుల్లో తన జీవితంలో నుంచి శాశ్వత సెలవు తీసుకుంది.

మళ్ళీ కాంతం గురించి ఆలోచన వస్తూనే ఉంది-గత ఇరవై అయిదేళ్ళుగా. కాని, ఆలోచన ఎప్పుడూ తను దేవుడి పీఠం దగ్గర కూర్చుని ఉండగానే వచ్చేది. ఆంజనేయస్వామి తన వంక చూసి మందహాసం చేస్తున్నట్టనిపించింది. ఆజన్మ బ్రహ్మచారి తన మానసిక దౌర్బల్యం అర్థంచేసుకుని క్షమించినట్టు...స్వామి ముఖం ప్రసన్నంగా కనబడేది. అయినా, గుండెలో ఏదో గుబులు. ఎక్కడో కాంతం హాయిగానే ఉండి ఉంటుంది. కాంతం తన జీవితంలో నుంచి వైదొలగడం గుండె మీద చిన్న గాటు చేసినా, విశ్వనాథంగారికి జీవితం ఎడల అవగాహన రోజు రోజుకీ లోతు పుంజుకుంది. ఆయన కాంతాన్ని పూర్తిగా మరచిపోలేకపోయినా, ఆమె ఉనికిని తెలిసికోవడానికి ఏనాడూ ప్రయత్నం చెయ్యలేదు. కాంతం వెళ్ళిపోయాక ఆయనకి కామక్షమ్మ మీద రోజురోజుకీ అవగాహన పెరిగింది. స్త్రీజాతి ఎడల రోజురోజుకీ గౌరవం పెరిగింది.

పూజచేసుకుంటుండగానే ఆయన కొక త్రుటిలో కామక్షమ్మ క్షమ, తాళి కట్టించుకున్న ఇల్లాలి ధైర్యం, నిబ్బరం చటుక్కున మనసులో మెదిలాయి. భర్త పర స్త్రీతో సాంగత్యం పెట్టుకున్నా తొణకకుండా, నిండుకుండలా తన మనసులోని ఆవేదనను ఉగ్గబట్టుకొని నిభాయించుకుంది. ఈ స్పందన ఆయనలో కలగడం ఇది మొదటిసారి కాదు; భగవంతుడు దయార్ద్ర హృదయుడు. దీనికంతటికీ ఆ భగవంతుడి దయే కారణ మనిపించింది విశ్వనాథంగారికి. కాంతం సమస్య ఇలా పరిష్కార మవుతుందని ఊహించని ఆయనకి ఇది కేవలం దైవిక మనిపించింది.

కాంతం వైదొలగి ఏళ్ళు గడిచాయి కాని, ఈ రోజు కాంతం గుర్తురావడం మనసులోని కలవరానికి కారణమయింది.

మళ్ళీ కాంతం ఎందుకు గుర్తొచ్చింది?

గతంలోకి తిరిగి చూసుకుంటే, తానెందు కలా ప్రవర్తించానా అని ఆత్మ పరీక్ష చేసుకుంటే-చిన్నతనం, తెలివితక్కువతనం, ఒళ్ళుతెలియని వేడి... అంటూ చిన్న చిరునవ్వుతో మందహాసం చేశారు విశ్వనాథంగారు.

నిట్టూరుస్తూ మళ్ళీ ఎదురుగా ఉన్న స్వామి పటం వంక చూశారు.

నీ సంగతి నాకు తెలుసులేవోయ్! అన్నీ నీ చేతుల్లో లేవు. నువ్వే నేరమూ చెయ్యలేదు. నిన్ను నేను అవగాహన చేసుకోగలను; క్షమించనూ గలను...అని మందహాసం చేస్తున్నట్టుఅనిపించింది.

చేతులు జోడించి, కళ్ళుమూసుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు విశ్వనాథంగారు. ఆయన పెదవుల మీద ఓ చిరునవ్వు-జీవితం ఎడల అవగాహన వల్ల వచ్చిన ముఖంలో వెలుగు...

పీట గోడకి చేరవేసి దేవుడి పీఠం దగ్గర సాష్టాంగ ప్రణామం చేస్తున్న భర్తను చూసింది కామక్షమ్మ.

"కామక్షీ!"

"సంధ్యావందనం అయిందా?...కాఫీ తీసుకుంటారా?" అంది.

"అబ్బాయ్ లేచాడా?"

"ఆఁ!...ఆఫీసుకు తయారవుతున్నాడు..."

"వాడి పెళ్ళి గురించి ఆలోచించావా?"

"నేనా?...భలే వాళ్ళే! నే నెవరిని?...అబ్బా, కొడుకూ ఇద్దరూ ఒకలాంటివాళ్ళే. నా వర కెందుకూ ఆలోచన?"

"ఏం...వాడి తల్లివి...నీకు బాధ్యతలేదూ?"

"వాడి పెళ్ళికి నా ఆలోచన ఎందుకు? వాడు అప్పుడే ఓ అమ్మాయిని ప్రేమించేశాడు...ఈ అబ్బకి కొడుకు వాడు...."

"నిజం! అయితే, తప్పకుండా ఆ పిల్లనే చెయ్యాలి. ఎవ రా అమ్మాయి? నీతో చెప్పాడా? వాడికి పాతిక పైబడ్డాయి. ఇంజనీరుగా చేస్తున్నాడు. ఇంత విశాలమైన భాగ్యనగరంలో ఎవరో ఆ అమ్మాయి? మనకి తెలిసిన పిల్లా?"

"ఏమో...మీరే అడగండి!" బుంగమూతి పెట్టింది కామక్షమ్మ.

"ఎంత అందంగా ఉన్నావ్, కామక్షీ...అలానే కాసేపు బుంగమూతి పెట్టు!" కాఫీ గ్లాసు తీసుకుంటూ అన్నారు విశ్వనాథంగారు.

"బాగుంది వరస!..." రుసరుసలాడింది ఆవిడ.

"మీ అన్నయ్య కూతుర్ని చేసుకోలేదని నీ బాధ! ఏం-ఎందుకు చేసుకోవాలి? ప్రేమించిన పిల్ల...వాడేమో నా కొడుకని నువ్వే అంటున్నావ్! ఆ మాత్రం ఆలోచనలేకుండా వాడు ప్రేమలో పడడు. చూడు, కామక్షీ! నీకు ముందే చెబుతున్నా వాడు ఓ పిల్లను ప్రేమించాడంటే నాకు సంతోషంగా ఉంది. ఉన్నది ఒక్కడే కొడుకనీ అన్న కూతుర్ని చేసుకోమని వాణ్ణి ఒత్తిడి చెయ్యను. వాడు బాగా ఆలోచించే ఉంటాడు. మన బంధుత్వాలకోసం వాడి మనసులోని మమతని తుడిచెయ్యవద్దు. వాడి ఇష్టమే మన ఇష్టం...నువ్ కాదనకు..."

"బావుంది. నే నెందుకు కాదంటాను. మీ ఇష్టానికి నే నెప్పుడూ ఎదురాడలేదు. వాడి ఇష్టం, మీ ఇష్టం...నే నెప్పుడూ కేవలం ఆడదాన్నే...మీరు చెప్పినట్టు నడుచుకోవడమే నాకు తెలుసు. రమాదేవి ఎవరో అడిగి తెలుసుకోండి!"

"రమాదేవా...ఎవ రా రమాదేవి? ఎవరి పిల్ల? ఏ ఊరు?"

"నాకు తెలీదు."

"నిజంగా...నా కయితే అవన్నీ అనవసరం. తెలుగు పిల్ల అయితేచాలు...కులం గొడవ కూడా నాకు లేదు. శాఖాహారి అయితే సంతోషం..."

"చాలా విశాలమైన మనసు మీది!"

ఆ మాటలోని వ్యంగ్యం విశ్వనాథంగారి గుండెలో గుచ్చుకుంది. "నిజమే, కామక్షీ! నా మనసు విశాలమైనదే కాని, నీ మనసు కంటె ఎత్తైనదిమాత్రం కాదు. ఇంతకీ ఎవ రా అమ్మాయి?"

"రమాదేవి..."

"రమాదేవి ఎవరు?"

"నాకు తెలియదు...మీ అబ్బాయినే అడగండి. పైగా మీ వంక వాళ్ళుగానీ, నా వంక వాళ్ళుగానీ వాడికి నచ్చలేదట..."

"ఆ మాట నీతో చెప్పాడా?"

"మగాడు మనసులోని మాట ఎప్పుడైనా ఎవరికైనా చెబుతాడా? పోనీ అంతవర కెందుకు? మీ రెప్పుడైనా చెప్పారా?"

"చెప్పడమెందుకోయ్! నీకు తెలియనిది నా మనసులో ఏముంది కనక! ఇప్పుడే కాదు...ఎప్పుడైనా?"

"తెలుసుకోవడం వేరు...మీరు చెబితే వచ్చే తృప్తి వేరు!"

"తృప్తికంటే బాధే కలిగితే..."

"బాధ కలిగించే పనులు ఎందుకు చెయ్యాలసలు?"

"నేనేం చెయ్యలేదు కాని, రమాదేవి ఎవరో చెప్పు. లేకపోతే..."

"భోజనం మానేస్తానని గొడవ చేస్తారు...అది అలవాటే కాని, మీ పుత్రరత్నం నాకూ చెప్పలేదే. నేను మీకేం చెప్పను? మీరే అడిగి తెలుసుకోండి."

"మరి రమాదేవి గరించి నీ కెలా తెలిసింది?"

"ఆ అమ్మాయికి ఉత్తరం రాస్తున్నాడు, నా కంటపడింది."

"కానీ ఆ అమ్మాయి ఎవరో తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లివి నీది...ఆ పెళ్ళి జరిపించే బాధ్యత నాది...వాణ్ణి కాదనకు మన వాళ్ళ బంధుత్వంకోసం. అయినా, ఈ రోజుల్లో వాడు ప్రేమించాడంటే

పిల్ల బాగా చదువుకున్నదే అయి ఉండాలి."

"మీ కొడుకు మీద మీకు చాలా నమ్మకం ఉందే!"

"నీ భర్తమీద నమ్మకం ఉండి నువ్వేం చెడ్డావ్! నమ్మి చెడిన వాళ్ళు లేరన్నది మన సూక్తి ముమ్మాటికీ నిజమే. కామాక్షీ! నువ్వు తలుచుకుంటే రమాదేవి గురించే కాదు...వాళ్ళ తాత ముత్తాతల గురించి తెలుసుకోగలవు."

కామాక్షమ్మ భర్త వంక చూస్తూ అలా నుంచుండిపోయింది. హెచ్చరిక లేకుండానే ఆమె కళ్ళలో నుంచి రెండు నీటి బొట్లు రాలాయి. విశ్వనాథంగారు ఆమెవంక చూసి ఉత్తరీయంతో ఆమె కళ్ళు తుడిచారు.

"నువ్వు దేవతవి, కామాక్షీ, మచ్చా లు మనిషివి కావు...నీ మనసు నొప్పించడం నా ఉద్దేశం కాదు. వాడి మనసులో చోటుచేసుకున్న మనిషితో వాడికి పెళ్ళి జరిపించడం మన కర్తవ్యం. నువ్వు ఆ పిల్ల గురించి వివరాలు తెలుసుకో...ఆలస్యం చేయకు."

మళ్ళీ రెండు రోజులవరకూ విశ్వనాథంగారు ఆ అమ్మాయి ప్రస్తావన తీసుకురాలేదు.

మూడో రోజు కామాక్షమ్మ కదిపింది- "రమాదేవి వాళ్ళ ఆఫీసులోనే జూనియర్ ఇంజినీరుగా చేస్తోందిట. పిల్ల బి. ఇ. పాసయింది. తండ్రి లేడట. తల్లితో ఉంటోందట-చిక్కడపల్లిలో...మనవాళ్ళేనట."

"నే చెప్పలేదూ! మన వాడు మనవాళ్ళ పిల్లనే చేసుకుంటాడు. వాడు నీ కొడుకు, కామాక్షీ! ఆవిడ ఎడ్రను తీసుకో...వెళ్ళి కదిపివస్తా!"

అంతే మరునటి రోజు ఎడ్రసూ తెలిసిపోయింది. ఆఫీసునుంచి నేరుగా ఆయన చిక్కడపల్లి వెళ్ళారు. ఇల్లు గుర్తు పట్టారు. బెల్ కొట్టారు.

తలుపు తెరుచుకుంది. కాంపౌండులో నన్నజాజి తీగ వంక చూస్తున్న విశ్వనాథంగారు తలుపు తెరుచుకోవడం కాస్త ఆలస్యంగా గుర్తించారు.

తలుపు తెరిచిన మనిషి "లోపలకి రండి" అని గదిలోకి వెళ్ళిపోయింది. గదిలో గోడకో ఫొటో. దానికి ఓ పూలమాల. ఆయనెవరో విశ్వనాథంగారికి తెలియదు.

"బాగున్నారా, విశ్వనాథంగారూ!"

"ఆఁ!" ఆయన ఆశ్చర్యంగా గదిలోకి చూశారు.

"నేనే!"...ఆవిడ లోపలినుంచే అంది.

"క్షమించాలి...నా పేరు మీరు..." ఆయన ప్రశ్న పూర్తి కాలేదు.

"నా పేరు కాంతం...ఆయనే...ఆ గోడ మీద ఫొటో మా వారు..."

"కాంతం!...కాంతమా?... నిజం!" ఆయన మాటలు తడబడ్డాయి. రమాదేవి కాంతం కూతురా? తనతో ఆనాడు...భగవాన్! ఏమి టీ పరీక్ష? నా తప్పిదాన్ని నువ్వే క్షమించి నన్ను కరుణించావనుకుని నీ దయ వెన్నెల వెల్లువై నా మీద లాస్యం చేస్తోందని మురిసిపోయానే!...నా కొడుకేమిటి? నాది కాలేకపోయినా, నాదైన కాంతం కూతురుని ప్రేమించడమా?

ఈ పెళ్ళికి నేనెలా ఒప్పుకోను. రమాదేవి వాడికి సొంత చెల్లెలని నా నోటి వెంట ఎలా చెప్పను?

కాంతానికి ఇది తెలుసా? నా పేరు తెలుసంటే... మరి రమాదేవికి వాడు నా వివరాలు చెబితే తెలిసి తెలిసి ఇలా? కాంతం నా మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోందా? వాడి మనసు గాయపడకుండా ఈ పెళ్ళిని ఎలా తప్పించడం?

విశ్వనాథంగారి మనసు మనసులో లేదు. దిగ్గున లేచి నుంచున్నారు. గిరుక్కున వెనుతిరిగి గది వంక చూడకుండా బయటకు వచ్చారు.

ఒక మెట్టు దిగారు.

"క్షమించాలి...మీరు తొందరపడుతున్నారు? నా ముఖం చూడటం మీకు ఇష్టం లేకపోవచ్చు. కాని, తొందరపడి నిర్ణయం తీసుకోకండి. లోపలికి వచ్చి రెండు నిమిషాలు కూచుంటే నే చెప్పే మాట వినవచ్చు..."

ఆమె లోపలనుంచి బయటకు రాలేదు. కాని, విశ్వనాథంగారు స్థాణువు అయిపోయారు. అడుగు ముందుకు పడలేదు. అలాగని వెనక్కి వెళ్ళడానికి మనస్కరించడంలేదు.

"లోపలికి రండి."

కాంతం మాటలు-ఆ గొంతు...ఆయన్ను బందీ చేసింది.

"నేనేనండీ!...మనం..."

ఆమె బయటికి రాలేదు. ఆమె ముఖం చూడడానికి ధైర్యంచాలలేదు విశ్వనాథంగారికి.

"కాంతం! నేను నిన్ను మరిచిపోలేదు. మనసులో మెదులుతూనే ఉన్నా, సంప్రదాయంకోసం నిన్ను మరిచిపోయినట్టు, నా గుండెలో ఓ భాగం చచ్చిపోయినట్టు నన్ను నేను నమ్ముకుంటూ వచ్చా! ఇదేమిటి, కాంతం...మన బిడ్డలిద్దరికీ పెళ్ళా? ఇదెలా సాధ్యం?"

"మీకు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఆవేశమే! మీ సంసారం పాడుచేసే ఉద్దేశం నాకెప్పుడూ లేదు. నా అదృష్టం ఇలా ఉంది...కానీ, ఇప్పుడు నా..."

"క్షమించు...కాంతం...ఒక్కసారి ఇలా వస్తావా?"

"వద్దు నా ముఖం మీకు చూపించను. నా బాధ మీతో నేను పంచుకోలేను. మీ ఆనందాన్నయితే పంచుకున్నాను. జరిగిందేదో జరిగిపోయింది. పిల్లవాళ్ళ ఆశలుమాత్రం మీరు తుడిచెయ్యకండి. మీ రనుకున్నట్టు నేను నెల తప్పలేదు. నేను గొడ్రాలిని. నాకు పిల్లలు లేరు. రమాదేవి మా వారి అక్క కూతురు. దాని రెండవ ఏట తల్లి పోయింది. మేము దానిని దత్తత చేసుకున్నాం. మీరు వావి వరసల అభ్యంతరాలని బయట పెట్టకండి. మీ కాంతం ఎప్పుడో చచ్చిపోయింది. ఒక స్త్రీగా, వితంతువుగా మిమ్మల్ని అర్థిస్తున్నాను. వాళ్ళిద్దరూ ఒకరి కొకరు మనసిచ్చుకున్నారు. ఏదో ఓ రోజు మీరే వస్తారని మీ రాకకోసమే ఎదురుచూస్తున్నాను. మీకు విషయం విప్పి చెప్ప గలిగాను...అంతే చాలు...వాళ్ళ ప్రేమకీ, మన గతానికీ సంబంధంలేదు."

"కాంతం! నువ్వు ఎంత కష్టాన్నీ ఇలా...నేనిక్కడ ఉన్నానని తెలిసికూడా..."

"మనసు గట్టి చేసుకున్నాను. మీరు చేసుకోలేదూ! ఇది జీవితం...ఇది ఘటన...కాదనడానికి మన మెవరం...వాళ్ళిద్దరినీ మీరూ, కామాక్షమ్మగారూ ఆశీర్వదిస్తే నా ప్రాణం కుదుటపడుతుంది. వారి ఆత్మా శాంతిస్తుంది...కాదనకండి!" ఆమెగొంతు పూడుకుపోయింది.

"అమ్మా!" లోపలికి వచ్చింది ఓ అమ్మాయి. "నమస్కారం..."

"నేనమ్మా...రమేష్ మా అబ్బాయి..."

"అమ్మా! ఆయన వస్తే బయటకి రావేమమ్మా! ఒక్క నిమిషం..." అంటూ లోపలికి వెళ్ళింది.

పదినిమిషాలైనా లోపలినుంచి ఎవరూ బయటికి రాకపోవడం విశ్వనాథంగారు విస్తుపోయారు.

కాంతం అమాంతం ఏదైనా అఘాయిత్యం చేసిందా?...కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది.

"క్షమించాలి...అమ్మ స్నానాల గదిలో ఉంది...కాఫీ తీసుకుంటారా?"

"లేదమ్మా, నే వెళతా...రమేష్ చెప్పాడు...ముహూర్తాలు పెట్టుకోవడానికి మంచిరోజు చూడాలిగా...మంచి రోజు చూసి వస్తానని చెప్పు...పాపం! మీ అమ్మ...చాలా మంచిమనిషి... విధి వంచితురాలు...ఆమెను ఎలా చూసుకుంటారో నువ్వూ, రమేష్ కూడా!" విశ్వనాథంగారు దిగ్గున లేచి వెడిపోతూ ఉంటే కళ్ళు చక్రాల్లా చేసుకుని అటు పైపే చూస్తూ ఉండిపోయింది రమాదేవి.

చకచకా అడుగులేస్తూన్న విశ్వనాథం గారికి చటుక్కున ఒక మెరుపు స్ఫురించింది-

స్నానాల గదిలో ముఖం చాటుచేసుకోక కాంతం తను ఎందుకు ఏడుస్తోందో కూతురికి సంజాయిషీ చెప్పుకోగలదా?-అఘాయిత్యం చేస్తుందనుకోవడమూ తొందరపాటే!

కాంతం అంత ఎత్తుకు ఎదిగిందని ఊహించలేక పోవడం పొరపాటు. రమాదేవి తన బిడ్డే అయితే ఆమెను వారించకుండా ఉంటుందనుకోవడమూ తన అవగాహనా లోపమే!

మరోసారి తన తొందరపాటుతనాన్ని గుర్తించేట్టు చేసింది కాంతం-మరో గొప్ప స్త్రీ! ●

## మౌక్తిక పర్యాయము

నా ఆత్మను గురించి నాకేమీ భయం లేదు
నేను చస్తే దానికేమీ నష్టం లేదు గనక-
పాపం! జీవిత పర్యంతరం నా సుఖదుఃఖాలు
పంచుకున్న నా శరీరాని
కేమవుతుందో అనే నా భయం
దాన్ని ఏ రాజకీయ క్రిములు తినేస్తాయో!

* * *

నేను డాములెందుకు కడుతున్నానో
భూములెందుకు దున్నుతున్నానో
నాకు తెలీదు!
నా బ్రతుకొక సున్న-కానీ నడుస్తున్నా
వేళ్ళు కాళ్ళై నడిచే చెట్టు మనిషి
చెట్టుగా ఉంటే ఏడాది కొక
వసంతమన్నా దక్కేది
మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను

\- శేషేంద్ర